www.prajasakti.com
ప్రజాశక్తి
బుధవారం 22 ఫిబ్రవరి 2023



రోగులకు మెరుగైన వైద్యసేవలు

కలెక్టర్ చక్రధర్‌బాబు

ప్రజాశక్తి-నెల్లూరు : జిల్లా ప్రభుత్వ ఆసుపత్రికి వచ్చే రోగులకు అన్ని మౌలిక సదుపాయాలతో మెరుగైన వైద్య సేవలం దించాలని కలెక్టర్ కె.వి.ఎన్. చక్రధర్ బాబు, వైద్యాధికారులను ఆదేశించారు. మంగళవారం తన కార్యాల యంలో జిల్లా ప్రభుత్వ ఆసుపత్రి (జిజిహెచ్) అభివద్ధి సొసైటీ కమిటీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, రోగులకు అన్ని మౌలిక సదుపాయాలు, చికిత్సలు అందుబాటులో ఉండే విధంగా ప్రభుత్వ ఆసుపత్రిని అభివద్ధి చేయాలన్నారు. ఆసుపత్రి అభివద్ధికి, మౌలిక వసతుల కల్పనకు తీసుకోవాల్సిన చర్యలపై దిశానిర్ధేశం చేశారు. ఆస్పత్రి పరిధిలో అందించే వైద్య సేవలన్నింటీని ఆరోగ్య శ్రీ పరిధిలోకి తీసుకు రావాలన్నారు. ఆస్పత్రికి వచ్చే రోగులకు మంచి వైద్య సేవలం దించాలని డాక్టర్లను ఆదేశించారు. జిజిహెచ్ సూపరింటెండెంట్ డా. శిద్దా నాయక్, ఎపిఎం ఎస్ఐడిసి ఈఈ విజయభాస్కర్, ఆసుపత్రి అభివద్ధి సొసైటీ కో ఆర్డినేటర్ సునంద, ఆసుపత్రి అభివద్ధి సొసైటీ కమిటీ సభ్యులు అభిషేక్ రెడ్డి, వెంకటేశ్వర్లు, జిజిహెచ్ కు సంబంధించిన వివిధ విభాగాల హెచ్.ఓ.డి లు ఉన్నారు.

మాట్లాడుతున్న కలెక్టర్

నేడు పిడిఎఫ్ అభ్యర్థుల నామినేషన్

చిత్తూరుకు కదిలిన నేతలు

ప్రజాశక్తి-నెల్లూరు ప్రతినిధి

తూర్పు రాయలసీమ నియోజకవర్గం టీచర్స్, గ్రాడ్యుయేట్ పిడిఎఫ్ అభ్యర్థులు నేడు నామినేషన్ దాఖలు చేయనున్నారు. టీచర్స్ అభ్యర్థి పి.బాబురెడ్డి, గ్రాడ్యుయేట్ అభ్యర్థి ఎం. వెంకేశ్వరరెడ్డి చిత్తూరు కలెక్టరేట్‌లో నేడు నామినేషన్ దాఖలు చేయనున్నారు. చిత్తూరు, ప్రకాశం, నెల్లూరు జిల్లాల నుంచి పెద్ద ఎత్తున యుటిఎఫ్, ప్రజా సంఘాల నేతలు నామినేషన్ కార్యక్రమానికి హాజరవుతున్నారు. మంగళవారం సాయంత్రం పెద్ద ఎత్తున కదలివెళ్లారు. బుధవారం ఉదయం మూడు జిల్లాల నుంచి పెద్ద ఎత్తున పిడిఎఫ్ అభిమానులు వెళ్లారు. నేడు ఉదయం చిత్తూరు కట్టమంచి చెరువు ప్రాంతంలోని స్వామి వివేకానందస్వామి సెంటర్ నుంచి ర్యాలీ ప్రారంభమవుతోంది. అక్కడ నుంచి టవర్‌క్లాక్ సెంటర్‌లో గాంధీ విగ్రహానికి పూలమాల వేస్తారు. అక్కడ నుంచి కలెక్టరేట్‌కు వెళ్లి ఇద్దరు అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేయనున్నారు. వైసిపి టీచర్స్ అభ్యర్థి పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి, గ్రాడ్యుయేట్ అభ్యర్థి శ్యామ్‌ప్రసాద్‌రెడ్డి నేడు చిత్తూరులో నామినేషన్ వేయనున్నారు. నెల్లూరులో స్థానిక సంస్థల ఎంఎల్‌సికి వైసిపి అభ్యర్థి మేరిగ మురళి నామినేషన్ దాఖలు చేయనున్నారు.

పొక్కిరెడ్డి బాబురెడ్డి, పిడిఎఫ్ ఉపాధ్యాయ అభ్యర్థి

మీగడ వెంకటేశ్వరరెడ్డి పిడిఎఫ్ పట్టభద్రుల అభ్యర్థి

కలిసి పనిచేయండి..!

ఎంఎల్‌సి ఎన్నికలపై సమీక్ష

ప్రజాశక్తి-నెల్లూరు ప్రతినిధి

ఎంఎల్‌సి ఎన్నికల్లో నేతలంతా కలిసి పనిచేయాలని, అభ్యర్థుల విజయానికి కృషిచేయాలని మాజీ మంత్రి రీజినల్ కో- ఆర్డినేటర్ బాలినేని శ్రీనివాసులురెడ్డి పిలుపు నిచ్చారు. మంగళవారం ఆపార్టీ ముఖ్యనేతలు, ఎంఎల్‌ఎలతో ఆయన జిల్లా వైసిపి కార్యాలయంలో సమీక్ష సమావేశం నిర్వహించారు. జిల్లా అధ్యక్షులు వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి ఆధ్వర్యంలో సమావేశం జరిగింది. బాలినేని మాట్లాడుతూ ప్రతి పక్షాలు విష ప్రచారం చేస్తున్నాయని సమర్థవంతంగా తిప్పికొట్టాలని సూచించారు. ముఖ్యమంత్రి కాగానే ఇచ్చిన మాట ప్రకారం సచివాలయ వ్యవస్థ ద్వారా లక్షా ఇరవై తొమ్మిది వేల ఉద్యోగాలు కల్పించి పట్టభద్రులకు అండగా ఉన్నారని పేర్కొన్నారు. అదే విధంగా నాడు-నేడు ద్వారా పాఠశాలలకు మహర్దశ కల్పించిన ఘనత ముఖ్యమంత్రి జగన్మోహరెడ్డిదని తెలిపారు. పట్టభద్రులకి ఉద్యోగ అవకాశాలు కల్పించిన. ఘనత ముఖ్యమంత్రిదని పేర్కొన్నారు. ఇటువంటి కార్యక్రమాలను విస్తతంగా ప్రచారం చేయాలని దిశ నిర్దేశం చేశారు. అందరం కలిసికట్టుగా పనిచేసి విజయబావుట ఎగుర వేయాలని కోరారు. మంత్రి కాకాణి గోవర్ధనరెడ్డి, ఎంపి ఆదాల ప్రభాకర్‌రెడ్డి, ఎంఎల్‌సి బల్లి కళ్యాణ్ చక్రవర్తి, ఎంఎల్‌ఎలు [illegible]రెడ్డి, పి.అనిల్‌కుమార్‌యాదవ్, కె.సంజీవయ్య, ఎంఎల్‌సి అభ్యర్థులు పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి, పేర్నాటి శ్యామ్ ప్రసాద్‌రెడ్డి, మేరిగ మురళీ పాల్గొన్నారు.

మాట్లాడుతున్న మంత్రి కాకాణి, బాలినేని, ఆదాల, వేమిరెడ్డి , ఎంఎల్‌ఏలు

రహదారులకు మరమ్మతులు చేపట్టాలని కోరుతూ

25న నిరసన : శ్రీధర్‌రెడ్డి

ప్రజాశక్తి-నెల్లూరు

రహదారులు, కాలువలు, కల్వర్టులకు మరమ్మతులు చేపట్టాలని ఈనెల 25న నగరంలోని రూరల్ ఎంఎల్‌ఎ కార్యాలయంలో నిరసన కార్యక్రమం చేపడుతున్నామని ఎంఎల్‌ఎ కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం రూరల్ ఎంఎల్‌ఎ కార్యాలయంలో విలేకర్ల సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఇప్పటికే ముస్లిముల సమస్యలపై నిరసన, ధర్నా విజయవంతంగా నిర్వహించామన్నారు. అధికారపక్షం అయినా... ప్రతిపక్షం అయినా తాను ప్రజల పక్షాన నిలబడుతానన్నారు. అభివృద్ధి పనుల నిర్వహణలో భాగంగా అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనులు జరిగాయని, ఈ పనులు పూర్తి చేసే సమయంలో పలు చోట్ల రహదారులను దెబ్బతిన్నాయన్నారు. ఈ సమస్యకు పరిష్కారం చూపాలని పలు మార్లు అధికారులకు విజ్ఞప్తి చేసినప్పటికీ పరిష్కారానికి నోచుకోలేదన్నారు. పొట్టేపాలెం కలుజు వద్ద వంతెన, రోడ్లు, బిసి భవన్, అంబెడ్కర్ భవన్ లైబ్రరీ పనులు నేటికీ అసంపూర్తిగానే ఉన్నాయన్నారు. కొమ్మరపూడి లిఫ్ట్ ఇరిగేషన్ లో సగం పనులు జరిగాయని, ఈ పనులు చేసిన కాంట్రాక్టర్‌కి ప్రభుత్వం నిధులు ఒక్కరూపాయి విడుదల చేయలేదన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి కాంట్రాక్టర్ కి బిల్లులు చెల్లించి లిఫ్ట్ ఇరిగేషన్ పూర్తి చేసి సన్న, చిన్నకారు రైతుల సమస్యలు పరిష్కరించాలన్నారు. ఈ సమస్యలు ప్రభుత్వం పరిష్కరించే వరకు పోరాటం చేస్తామని, అవసరం అయితే న్యాయపోరాటం చేస్తామన్నారు. ఇరుకళల అమ్మవారి జాతరను తాను, స్నేహితుల సహకారంతో మార్చి 26, 27, 28న జాతర నిర్వహిస్తామన్నారు. దైవ కార్యక్రమానికి ఎన్నికల కోడ్ ముడిపెట్టడం ఎంత వరకు న్యాయమో ఆలోచించాలన్నారు. ఈ నెల 25లోపు అనుమతి ఇవ్వాల్సి ఉందని, .26న మూగ చాటింపు వేయించాల్సి ఉందన్నారు. తన మీదు ఉన్న అక్కస్సుతో ఇటువంటి నిర్ణయం తీసుకోవడం సరికాదన్నారు.

మాట్లాడుతున్న ఎంఎల్‌ఎ శ్రీధర్‌రెడ్డి

ఎఐసిసి నిర్ణయంతోనే పొత్తులు..!

పిసిసి అధ్యక్షులు గిడుగు రుద్రరాజు

ప్రజాశక్తి-నెల్లూరు ప్రతినిధి

అఖిల భారత కాంగ్రెస్ పార్టీ నిర్ణయం మేరకు రానున్న ఎన్నికల్లో రాష్ట్రంలో ఎవరితో పొత్తు పెట్టు కుంటుందో తెలుతుందని పిసిసి అధ్యక్షులు గిడుగు రుద్రరాజు అన్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ ఆస్తుల పరిరక్షణ కమిటీ ఛైర్మన్, నెల్లూరు జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు చేవూరు.దేవకుమార్ రెడ్డి ఆధ్వర్యంలో మంగళవారం స్థానిక ఇందిరాభవన్‌లో హాథ్ సే హాథ్ జోడో అభియాన్ సమీక్ష నిర్వహించారు. ముఖ్య అతిథులుగా పిసిసి అధ్యక్షులు గిడుగు రుద్రరాజు, ఎపిసిసి కార్యదర్శి సిడి.మెయప్పన్, ఎపిసిసి కార్యనిర్వాహక అధ్యక్షుడు షేక్. మస్తాన్ వలీ, నెల్లూరు జిల్లా ఇన్‌ఛార్జులు దొడ్డారెడ్డి రాంభూపాల్ రెడ్డి, పగడాల రంగస్వామి. హాజరయ్యారు. గిడుగు రుద్రరాజు మాట్లాడుతూ.. ఒక సామాన్య విద్యార్థి నాయకుడిగా ఎన్‌ఎస్‌యుఐ ఆర్గనైజేషన్లో పనిచేసిన నన్ను రాష్ట్ర కాంగ్రెస్ పార్టీకి అధ్యక్షుడిగా నియమించిందంటూ నా జీవితాంతం అఖిలభారత జాతీయ కాంగ్రెస్ పార్టీకి ఎల్లవేళలా రుణపడి ఉంటానని కృతజ్ఞతలు తెలిపారు. దేశంలో ప్రధాని నరేంద్రమోడీ ప్రయివేటీకరణ పేరుతో కార్పొరేట్ సంస్థలకు కట్టబెట్టుతుంటే రాష్ట్రంలో వైసీపీ ముఖ్యమంత్రి వైఎస్.జగన్మోహన్ రెడ్డి ఏకంగా అమ్మకాలు చేస్తున్నారని మండి పడ్డారు..మంచి పరిపాలన గురించి దేశంలో ప్రధాని నరేంద్ర మోడీని, రాష్ట్రంలో వైసిపి ముఖ్యమంత్రి వైఎస్.జగన్మోహన్ రెడ్డిని ప్రశ్నించిన వారిపై పోలీసు శాఖ ద్వారా కేసులు పెట్టి జైలుకు పంపించడం దుర్మార్గమని దుయ్యబట్టారు. నెల్లూరు జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు చేవూరు.దేవకుమార్ రెడ్డి మాట్లాడుతూ..జిల్లాలో భారీ ప్రాజెక్టులైన కృష్ణపట్నం పోర్టు, మేనకూరు సెజ్, శ్రీహరి కోట రాకెట్ కేంద్రం, సోమశిల హైలెవెల్ కెనాల్, చేజర్ల బ్రిడ్జి, నెల్లూరు, సంగం బ్యారేజీలు, నిమ్స్ పరిశోధ కేంద్రం, ప్రభుత్వ మెడికల్ కళాశాల తదితర ప్రాజెక్టుల నిర్మాణం కేవలం కాంగ్రెస్ పార్టీ మాత్రమే చేసిందని గుర్తు చేశారు. కార్యక్రమంలో సీనియర్ నాయకుడు సి.వి.శేషారెడ్డి, మాజీ సేవాదళ్ రాష్ట్ర అధ్యక్షులు భవానీ నాగేంద్ర ప్రసాద్, అన్ని నియోజకవర్గ ఇన్‌ఛార్జులు ఉడతా.వెంకట్రావు, చేవూరు.శ్రీధర్ రెడ్డి, చింతల .వెంకట్రావు, షేక్.ఫయాజ, పరిమళ. వెంకటేశ్వర్లు, దుద్దుకూరు.రమేష్ నాయుడు, కిసాన్ సెల్ అధ్యక్షులు ఏటూరి.శ్రీనివాసులు రెడ్డి, డిసిసి ఉపాధ్యక్షులు తలారి. బాల సుధాకర్,సేవాదళ్ జిల్లా అధ్యక్షులు కొండా. అనిల్ కుమార్‌లు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న గిడుగు రుద్రరాజు

పిడిఎఫ్ అభ్యర్థులను గెలిపించండి

ప్రజాశక్తి-తోటపల్లిగూడూరు : ఎంఎల్‌సి ఎన్నికల్లో పిడిఎఫ్ అభ్యర్థులను గెలిపించాలని కోరుతూ గూడ్స్ షెడ్ ముఠావర్కర్స్, ఆటో యూనియన్ వర్కర్స్, సిపిఎం పార్టీలు కోరాయి. మంగళవారం తోటపల్లిగూడూరు మండలం పేడూరు గ్రామ పార్టీ శాఖ ఆధ్వర్యంలో రెండవ రోజు ప్రచారం నిర్వహించడం జరిగింది. ఆటో యూనియన్ జిల్లా అధ్యక్షులు (సీఐటీయు) మారుబోయిన రాజా మాట్లాడుతూ విద్యార్థులకు నాణ్యమైన విద్య, ప్రభుత్వ భావనలు సాధించాలంటే పిడిఎఫ్ ఎంఎల్‌సి అభ్యర్థులను గెలిపించాలని పిలుపునిచ్చారు. పట్టభద్రులు, ఉపాధ్యాయ ఎన్నికల్లో గతంలో ఎన్నడూ లేని విధంగా రాజకీయాలు జోక్యం అయ్యాయా న్నారు. పిడిఎఫ్ అభ్యర్థులు పోరాటాల ద్వారా ఎన్నో సాధించారని రాజా తెలిపారు. ఈ నేపథ్యంలో ఈ ఎమ్మెల్సీ ఎన్నికల్లో పీడిఎఫ్ అభ్యర్థులను గెలిపించి నాణ్యమైన విద్య, ప్రభుత్వ భవనాలను సాధించే అవకాశం కలిగించాలని రాజా కోరారు. కార్యక్రమంలో గూడ్స్ షెడ్ ముఠావర్కర్స్ ఆటో యూనియన్ వర్కర్స్ మరియు సిపిఎం పార్టీ శాఖ ప్రతినిధులు పాల్గొన్నారు.

ప్రచారం చేస్తున్న నాయకులు

జాతీయ స్థాయి తైక్వాండో పోటీలకు

'ఆక్స్‌ఫర్డ్' విద్యార్థులు ఎంపిక

ప్రజాశక్తి -కందుకూరు : కందుకూరు ఆక్సఫర్డ్ విద్యార్థులు జాతీయస్థాయి తైక్వాండో పోటీలకు ఎంపికయ్యారు. ఇటీవల అనకాపల్లిలో జరిగిన రాష్ట్రస్థాయి తైక్వాండో పోటీలలో క్యాడెట్ విభాగంలో కందుకూరు ఆక్సఫర్డ్ విద్యార్థులు బంగారు పతకాలను సాధించి ఈనెల 24, 25, 26 తేదీల్లో హైదరాబాద్ గచ్చిబౌలి స్టేడియంలో జరిగే జాతీయ తైక్వాండో పోటీలకు ఎంపికయ్యారు. ఉమ్మడి ప్రకాశం జిల్లాలో మొత్తం 6 మంది విద్యార్థులు ఎంపికైతే ఆక్సఫర్డ్ నుంచి ముగ్గురు ఎంపిక య్యారు. జాతీయ తైక్వాండో పోటీలకు ఎంపికైన విద్యార్థులను ఉద్దేశించి ఆక్సఫర్డ్ విద్యాసంస్థల చైర్మన్ ఉన్నం భాస్కరరావు మాట్లాడుతూ విజయకాంక్ష కలిగిన వారు ఉన్నత శిఖరాలకు చేరుకుంటారని తెలిపారు. డైరెక్టర్ బాల భాస్కర్ మాట్లాడుతూ శ్రమ నీ ఆయుధమైతే విజయం నీ బానిస అవు తుందని తెలిపారు. కరెస్పాండెంట్ బండి వెంకటేశ్వర్లు, కళాశాల డైరెక్టర్ బి నరేంద్ర, ప్రిన్సిపాల్స్ మల్లికార్జున, రామారావు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు. బంగారు పతకాలు సాధించిన వారిలో బిఎల్ అక్షర, ఐ శ్రావ్య, గోను గుంట వరుణ్ చౌదరి ఉన్నారు. ఎపి క్వాండో ట్రెజరర్ ఎస్.కె అబ్దుల్ సలాం పర్య వేక్షణలో పోటీలు జరిగాయి.బంగారు పథకాలు సాధించిన విద్యార్థులను అభినందించారు.



ఎన్‌జిఒ నూతన కమిటీ ఎన్నిక

పొదలకూరు : పొదలకూరు తాలూకా ఎపిఎన్‌జిఒ అధ్యక్షులు కె. శ్రీనివాసులు,కార్యదర్శి ఎన్. చిరంజీవి , జిల్లా సహాధ్యక్షులు ఆంజనేయ వర్మ అధ్వర్యంలో పొదలకూరు తాలూకా మహిళా విభాగం ఎన్నికలను మంగళవారం నిర్వహిం చారు. స్థానిక సిహెచ్‌సి ప్రాం గణంలో జరిగిన సమావేశంలో కార్యవర్గ సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. పొదలకూరు తాలూకా మహిళా విభాగం అధ్యక్షులుగా కె. సుశీల, సహాధ్యక్షులుగా కె. అనసూయ, ఉపాధ్యక్షులుగా జె సుధారాణి, కె. నాగభూషణమ్మ, టి. సంధ్య, సిహెచ్ విద్యుల్లత, ఎస్ వెంకటరమణమ్మ, ప్రధాన కార్యదర్శిగా ఎస్.కె కరిమున్నీసా, ఆర్గనైజింగ్ సెక్రటరీగా ఎస్.కె. సోని, సహాయ కార్యదర్శి వి. సుప్రజ, ఎం.రమణమ్మ, పి రాజా, వి. కష్ణవేణి, సీ.హెచ్ హైమా వతి, ట్రెజరర్ గా ఎస్. మునిరాధిక లను ఏకగ్రీవంగా ఎన్ను కున్నారు.ఎలక్షన్ ఆఫీసర్స్‌గా, రాష్ట్ర మహిళా ఉపాధ్యక్షురాలు కె.స్వర్ణలత, జిల్లా ఉపాధ్యక్షురాలు కరుణమ్మ, జిల్లా ఉపాధ్యక్షులు ఎన్. మధు, రాష్ట్ర ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ మెంబర్ జి వరలక్ష్మి, జిల్లా మహిళా ఛైర్పర్సన్ యూ.చినమ్మ పాల్గొన్నారు.

నూతన కమిటీ సభ్యులు...

శ్రమజీవుల పాలన రావాలి : సిపిఎం

ప్రజాశక్తి -గుడ్లూరు : దేశంలో దోపిడీ వ్యవస్థను రూపుమాపి కష్టజీవుల పాలన వచ్చేందుకు శ్రామికుల్ని చైతన్యవంతం చేయాలని వ్యవసాయ కార్మిక సగు జిల్లా ఉపాధ్యక్షులు జి వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. గుడ్లూరు హై స్కూల్ ఆవరణంలో సిపిఎం నాయకులు కె వెంకయ్య అధ్యక్షతన రెడ్ బుక్ డే దినోత్సవం మంగళవారం నిర్వహించారు. విప్లవ సాహిత్యాన్ని ప్రతి ఒక్కరూ చదివి సామాన్యులకి అర్థమయ్యే విధంగా తెలియజేయాలని జి వెంకటేశ్వర్లు తెలిపారు. జరుగుతున్న దోపిడి గురించి వివరించాలన్నారు. సిపిఎం నాయకులు రైతు సంఘం నాయకులు కె అంజయ్య, విజయమ్మ ,దాసరి సీతారాం, ఎస్కే ఖాదర్బాషా, నేలటూరి తిరుపాలు, సైదులు, మల్లికార్జున, ఎం వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

'స్వచ్ఛ నెల్లూరు'కు కృషి : కమిషనర్

ప్రజాశక్తి-నెల్లూరు

నగర వ్యాప్తంగా పారిశుధ్య నిర్వహణపై ప్రత్యేక దష్టి సారించి స్వచ్ఛ నెల్లూరు సాకారానికి కషి చేయాలని అధికారులు, సచివాలయ కార్యదర్శులను నగర పాలక సంస్థ కమిషనర్ శ్రీమతి హరిత ఆదేశించారు. పారిశుధ్య నిర్వహణ పనుల పర్యవేక్షణలో భాగంగా స్థానిక 6వ డివిజన్ శెట్టిగుంట రోడ్డు ప్రాంతంలో డోర్ టు డోర్ చెత్త సేకరణ పనులను అధికారులతో కలిసి కమిషనర్ మంగళవారం పరిశీలించారు. స్థానికంగా ఉన్న వివిధ వీధుల్లో డ్రైను కాలువల్లో పూడికతీత పనులు చేపట్టాలని, దోమల నిర్మూలనకు మురుగునీరు నిల్వ ఉండకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. దోమల నివారణా చర్యల్లో భాగంగా అన్ని డ్రైను కాలువల్లో ఆయిల్ బాల్స్ పిచికారీ చేయాలని, క్రమం తప్పకుండా ఫాగింగ్ పనులు నిర్వహించాలని కమిషనర్ సూచించారు. నగర పాలక సంస్థ అందజేసిన చెత్త బుట్టలలో తడి, పొడి చెత్తను విడిగా తీసి ఉంచాలని, రీ సైక్లింగ్ విధానానికి ప్రజలంతా బాధ్యతగా సహకరించాలని కమిషనర్ కోరారు. అనంతరం 9వ డివిజన్ నరుకూరు మెయిన్ సెంటర్ ప్రాంతంలో గ్యాంగ్ వర్క్ పనులలో భాగంగా చేపట్టిన డ్రైను కాలువల పూడికతీత పనులను కమిషనర్ పర్యవేక్షించారు. డివిజన్ పరిధిలోని అన్ని ప్రాంతాల్లో డ్రైను కాలువల్లో పూడికతీత, సిల్ట్ తొలగింపు పనులను వేగవంతం చేయాలని కమిషనర్ ఆదేశించారు.ఈ కార్యక్రమంలో నగర పాలక సంస్థ ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ వెంకట రమణ, ఇంజనీరింగ్, టౌన్ ప్లానింగ్, రెవెన్యూ విభాగం అధికారులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

గిరిజన సమస్యలు పరిష్కరించండి

యానాదుల సంక్షేమ సంఘం

ప్రజాశక్తి-నెల్లూరు

గిరిజనుల సమస్యల పరిష్కారానికి సహకరించాలని రాష్ట్ర ఎస్‌టి కమిషన్ సభ్యులు వడిత్యా శంకర్ నాయక్‌ను యానాదుల సంక్షేమ సంఘం నాయకులు విజ్ఞప్తి చేశారు. మంగళవారం నగరానికి విచ్చేసిన ఎస్‌టి కమిషన్ సభ్యులు వడిత్యా శంకర్ నాయక్‌ను ఆర్ అండ్‌బి అతిథి గృహంలో మర్యాద పూర్వకంగా యానాదుల సంక్షేమ సంఘం నాయకులు కలిశారు. గిరిజనులకు సంబంధించిన పలు సమస్యలను నాయకులు ఆయన దృష్టికి తీసుకొచ్చారు. గిరిజన గురుకులాల సమస్యలు, ఆధార్ కార్డులు, భూ సమస్యలు, ఉపాధి అవకాశాలు తదితర సమస్యలపై నాయకులు చర్చించారు. జిల్లాలోని ఆయా కాలనీల్లో పర్యటించి, సమస్యలను ప్రభుత్వం దష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర అధ్యక్షులు కెసి పెంచలయ్య, ఆర్గనైజింగ్ సెక్రటరీస్ పుత్తూరు శ్రీనివాసరావు, ఇండ్ల మల్లికార్జున, జిల్లా అధ్యక్షులు తిరివీధి సతీష్ చంద్ర, జిల్లా మహిళా అధ్యక్షురాలు చెంబేటి ఉష పాల్గొన్నారు.

టిడిపి కార్యాలయంపై దాడి హేయం

ప్రజాశక్తి -కందుకూరు : కష్ణాజిల్లా గన్న వరంలో సోమవారం టిడిపి కార్యాల యంపై వైసీపీ గూండాలు దాడి చేయడం సైకో పాలనకు పరాకాష్ట అని కందుకూరు నియోజ కవర్గ టిడిపి ఇన్‌ఛార్జి ఇంటూరి నాగేశ్వరరావు పేర్కొన్నారు. టిడిపిబీసీ నాయకుడు దొంతు చిన్నాను స్థానిక వైసిపి ఎమ్మెల్యే వల్లభనేని వంశీ అనుచరులు బెదిరించి ఆయన ఇంటిపై దాడి చేయడం దుర్మార్గమన్నారు. అక్కడ పోలీసులు ప్రేక్షక పాత్ర వహిస్తూ వైసిపి గుండాలకు సపోర్ట్ చేశారని ఆయన పేర్కొన్నారు. వైసిపి ప్రభుత్వానికి రోజులు దగ్గరపడ్డాయని, తగిన మూల్యం చెల్లించుకోక తప్పదన్నారు.టిడిపి జాతీయ కార్యదర్శి పట్టాభిరామ్‌ను ను తక్షణమే విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

ఇంటూరి నాగేశ్వరరావు

సిగ్గుమాలిన చర్య : శివరాం

గన్నవరం నియోజ కవర్గంలో టిడిపి కార్యాలయంపై వైసిపి నాయకులు, ఎంయల్‌ఎ వల్లభనేని వంశీ అనుచరులు చేసిన దాడి సిగ్గుమాలిన చర్య అని, ఆదాడిని తీవ్రంగా ఖండిస్తున్నట్లు మాజీ ఎంఎల్‌ఎ డాక్టర్ దివి శివరాం తెలిపారు. ఆయన పట్టణం టిడిపి కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు విలేకర్లతో మాట్లాడారు. గన్నవరం నియోజకవర్గంలో ఎంఎల్‌ఎగా ఉన్నటువంటి వల్లభనేని వంశీ అతని అనుచరులు రౌడీ మూకలుగా తయారయ్యారన్నారు. ఉద్దేశ్యపూ ర్వకంగానే టిడిపి కార్యాలయంపై దాడిచే యడం, ఫర్నిచర్ ధ్వంసం చేయడం, కార్లు తగలబెట్టడం వంటి దుర్మార్గమైన నీచమైన చర్య అన్నారు. రౌడీ మూకలు ఇటువంటి చర్యలు మానుకోకపోతే తాము తగిన రీతిలో సమాధానం చెప్పాల్సి వస్తుందని శివరాం హెచ్చరించారు. ముస్లిం మైనారిటీ కందుకూరు నియోజకవర్గం అధ్యక్షులు షేక్ నాయబ్ రసూల్ ,ముస్లింమైనారిటీ రాష్ట్ర అధికార ప్రతినిధి షేక్ రఫీ, మాట్లాడుతూ జగన్మోహన్ రెడ్డి ముస్లిములను ఓటర్లగానే చూస్తున్నారే తప్ప నాయకులుగా చూడట్లేదు అనడానికి ప్రత్యక్ష ఉదాహరణ సోమవారం విడుదల చేసిన ఎంఎల్‌సి అభ్యర్థుల జాబితా తార్కాణమని తెలిపారు. నెల్లూరు పార్లమెంటు టిడిపి అధికార ప్రతినిధి గోచిపాతల మోషే, కందుకూరు పట్టణ అధ్యక్షులు దామా మల్లేశ్వరరావు, ఎస్సీ సెల్ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి చదలవాడ కొండయ్య, బీసీ సెల్ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి చిలకపాటి మధుబాబు, వాణిజ్య విభాగం రాష్ట్ర కార్యనిర్వాహ కార్యదర్శి కూనం నరేంద్ర ఉన్నారు.

మాట్లాడుతున్న టిడిపి నేత దివి శివరాం

బహుమతులు ప్రదానం

ప్రజాశక్తి-నెల్లూరు : స్థానిక కొండాయపాళెం ప్రాంతంలోని నగర పాలక ప్రాథమిక పాఠశాలలో అంతర్జాతీయ మాతభాషా దినోత్సవం సందర్భంగా విద్యార్థులకు తెలుగు భాష పై వక్తత్వ పోటీలు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు యం భాస్కర్ రావు ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ పోటీలో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలుగు భాషా గొప్పతనాన్ని ఎంత చెప్పినా తక్కువే ప్రపంచంలోనే ఎక్కువ అక్షర మాల కలిగిన భాష మన తెలుగు భాష.పాలు కన్నా, పంచదార కన్నా, తేనె కన్నా తీయనిది మన తెలుగు భాష. కాబట్టి మన భాషను కాపాడుకోవడానికి మనందరం ప్రయత్నించాలన్నారు.ఉపాధ్యాయులు హరీష్, సంధ్యారాణి,మాధవి వాలంటీర్లు పాల్గొన్నారు

నేడు క్విజ్ పోటీలు

ప్రజాశక్తి -నెల్లూరు

స్థానిక డికెడబ్ల్యూ కళాశాల సమావేశమందిరంలో నేడు జిల్లాలోని పలు డిగ్రీ కాలేజీ విద్యార్థులకు అధికారిక గణాంకాల వ్యవస్థ ప్రభుత్వ ప్రయివేటు రంగాల్లో ఉద్యోగ, ఉపాధి అవకాశాలు" అన్న అంశంపై చర్చి, అనంతరం క్విజ్ పోటీలు నిర్వహిస్తున్నట్లు కళాశాల అధికారులు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ప్రముఖులు ప్రసంగించి పోటీలలో ప్రతిభను కనపరిచిన విద్యార్థులకు బహుమతులు అందజేయున్నట్లు తెలిపారు. జాతీయ గణాంక కార్యాలయం, సీనియర్ గణాంక అధికారులు జి. శ్రీనివాసరావు, టి. రామకష్ణలు పాల్గొని పర్యవేక్షిస్తారని తెలిపారు.

బాలికపై అత్యాచారం

ప్రజాశక్తి-కోవూరు : బాలికపై అత్యాచారం జరిగిన సంఘటన మండలంలోని కోవూరు పంచాయతీ గుమ్మళ్ల దెబ్బలో జరిగింది. వివరాల మేరకు గుమ్మళ్లదిబ్బకు చెందిన పవన్‌తో అక్కడే ఉండే ఓ బాలిక సన్నిహితంగా ఉండేది. పవన్‌ను అన్నా.. పిలిచేది. దీంతో కుటుంబ సభ్యులు పెద్దగా పట్టించుకోలేదు. ఈ నేపథ్యంలో మంగళవారం ఆ బాలికపై పవన్ అత్యాచారానికి ఒడిగట్టాడు. బాలిక వారిస్తున్నా పట్టించుకోలేదు. తల్లిదండ్రులకు చెబితే చంపేస్తానని బెదిరించాడు. చివరకు ఆ బాలిక తల్లిదండ్రులకు చెప్పింది. దీంతో తల్లిదండ్రులు మంగళవారం కోవూరు పోలీసులను ఆశ్రయించారు. తన బిడ్డ జీవితాన్ని అన్యాయం చేసిన ఆ కామాంధుడిపై కఠిన చర్యలు తీసుకోవాలని తల్లిదండ్రులు డిమాండ్ చేశారు. కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. మహిళా కమిషన్ సభ్యురాలు గజ్జల లక్ష్మీ పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి అత్యాచారం కేసు వివరాలను తెలుసుకున్నారు. నిందితుడిని కఠినంగాశిక్షించాలని పోలీసులకు ఆదేశించారు.

లేగ దూడల ప్రదర్శన

ప్రజాశక్తి-వలేటివారిపాలెం : మండలంలోని పోకూరు గ్రామంలో ఉన్న పశు వైద్యశాలలో లేగదూడల ప్రదర్శన మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన శిబిరాన్ని ఎంపిపి పొనుగోటి మౌనిక, జడ్పీటిసి ఇంటూరి భారతి ప్రారంభించారు. అనంతరం జరిగిన సభకు పశువైద్యాధికారిణి శిఖా హర్షశ్రీ అధ్యక్షత వహించారు. ఒంగోలు జిల్లా పశుగణాభివృద్ధి సంఘం కార్యనిర్వాహకులు, డాక్టర్ కాలేషా మాట్లాడుతూ మేలుజాతి వీర్యాన్ని తమ సంస్థ ద్వారా రైతులకు అందిస్తున్నట్లు చెప్పారు. తద్వారా జాతి అభివృద్ధికి పాటుపడుతున్నట్లు వివరించారు. కందుకూరు ఉపసంచాలకులు చంద్రశేఖర్ మాట్లాడుతూ రైతులు, రైతుభరోసా కేంద్రాల ద్వారా పశువైద్య సహాయకుల నుంచి సేవలను పొందాలని సూచించారు. వలేటివారిపాలెం మండలానికి ప్రభుత్వం ఒక పశువైద్యంకు సంబంధించి అంబులెన్స్‌ను కేటాయించినట్లు, ఆ సేవలు కూడా ఉచితంగా అందిస్తున్నట్లు, సేవలు పొందదలిచిన రైతులు 1962 నెంబరుకు ఫోన్ చేసి పొందవచ్చునని తెలిపారు. దూడలకు ముర్రుపాలు తాగించాలన్నారు. ఆడదూడలను బాగా పోషించడం వలన భవిష్యత్తులో మంచి గేదెలు వస్తాయని, తద్వారా లాభాలు పొందవచ్చునని తెలిపారు. ఈ సందర్భంగా రైతులకు ఉచితంగా మందులు పంపిణీ చేశారు. వివిపాలెం పశు వైద్య సహాయ సంచాలకులు కెవి బ్రహ్మయ్య, పశువైద్యాధికారులు శ్రీకాంత్, కామేశ్వరరావు, వైద్యసిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

శిబిరాన్ని ప్రారంభిస్తున్న జెడ్‌పిటిసి భారతి

ప్రమాదాల నివారణకు చర్యలు

నెల్లూరు : కర్మాగారాల్లో జరిగే రసాయనాల దుర్ఘటనల పట్ల అప్రమత్తంగా ఉండి యుద్ధ ప్రాతిపదికన సహాయక చర్యలు చేపట్టాలని రాష్ట్ర విపత్తు నిర్వహణ సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ అధికారులకు సూచించారు. మంగళవారం గుంటూరులోని రాష్ట్ర విపత్తు నిర్వహణ సంస్థ కార్యాలయం నుంచి ఎన్ డి ఎం ఏ సలహాదారులు మొహంతితో కలసి రాష్ట్రంలోని 11 జిల్లాల కలెక్టర్లు సంబంధిత శాఖల అధికారులతో కర్మాగారాల్లో రసాయనాల దుర్ఘటనలు – రెండో దశ టేబుల్ టాప్ ఎక్సర్సైజ్ కార్యక్రమం పై వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. జిల్లాల వారీగా చేపడుతున్న ముందస్తు జాగ్రత్తలపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. వారు పలు సూచనలు చేశారు. కలెక్టరేట్ లోని శ్రీ ఎస్ ఆర్ శంకరన్ వి.సీ. హాల్ నుంచి జిల్లా రెవెన్యూ అధికారి వెంకటనారాయణమ్మ జిల్లా పరిశ్రమల కేంద్రం జనరల్ మేనేజర్ మారుతి ప్రసాద్, డిఎస్‌పి సుభాని,నగరపాలక సంస్థ ఎస్.ఈ. సంపత్ కుమార్ పాల్గొన్నారు.

ఇదేమి ఖర్మ మన రాష్ట్రానికి..

ప్రజాశక్తి -ఉలవపాడు : మండలంలోని వీరేపల్లిలో ఇదేమి ఖర్మ మన రాష్ట్రానికి కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా టిడిపి ముఖ్య నేతలు, క్లస్టర్, యూనిట్ ఇన్‌ఛార్జులు పోలింగ్ బూత్ పరిధిలోని నాయకులు ప్రతి ఇంటికి వెళ్లి సమస్యలు తెలుసుకున్నారు. తొలుత పడమర ఎస్‌టి కాలనీలో ఇంటింటికి తిరుగుతూ ప్రభుత్వ వైఫల్యాలను వివరించారు. నేతలు మాట్లాడుతూ ఇంటూరి నాగేశ్వరరావు ఆధ్వర్యంలో ఈసారి ఎన్నికల్లో కందుకూరులో తెలుగుదేశం విజయం సాధించడం ఖాయమన్నారు. అనంతరం గ్రామంలో రచ్చబండ నిర్వహించారు. గ్రామపార్టీ అధ్యక్షుడు మోదుగుల గురవయ్య, గ్రామ పార్టీ నాయకులు లక్కం రాజు నరేష్, కాకర్లపూడి ఆదినారాయణ రాజు, కాకర్లపూడి నాగరాజు, దంతులూరి గోపికష్ణ, కందగడ్ల సత్యనారాయణ, కాకర్లపూడి శ్రీనివాసరాజు, తోట మహేంద్ర, తాటితోటి నాగేశ్వరరావు, వేములపాటి లక్ష్మీనారాయణ, మానికల పెంచలయ్య, పొట్లూరి లక్ష్మీనారాయణ ఉన్నారు.

అంతర్జాతీయ మాతృభాష దినోత్సవం

ప్రజాశక్తి-ఆత్మకూరు అర్బన్
తెలుగు భారతి సేవాసమితి అధ్వర్యంలో ఆత్మకూరులోని ఆశ్రమ ప్రాంగణంలో మంగళవారం అంతర్జాతీయ మాతృభాష దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా మండలంలోని ప్రభుత్వ, ప్రయివేటు పాఠశాలలోని సుమారు 400 మంది విద్యార్థులకు రెండు స్థాయిలుగా అంటే 3,4,5 తరగతులు ఒకస్థాయిగా, 6,7,8 తరగతుల ఒక స్థాయిగా విభజించి ఉక్తలేఖనం, అభినయంతో కథలు చెప్పడం, పద్యాలు, క్విజ్, మంచి దస్తూరి వంటి పోటీలు పిల్లలకు నిర్వహించి విజేతలైన పిల్లలకు మొదటి, రెండవ, మూడవ బహుమతులు అందజేశారు. అనంతరం అతర్జాతీయ మాతృభాష దినోత్సవ ప్రాధాన్యత గురించి వక్తలు వివరించారు. కార్యక్రమంలో తెలుగు భారతి సేవాసమితి అధ్యక్షులు గోవిందరెడ్డి ప్రధాన కార్యదర్శి రామిరెడ్డి, గౌరవాధ్యక్షుడు ఎస్ వి రమణయ్య, తెలుగు భారతి సేవాసమితి ప్రతినిధులు చలమయ్య, సుబ్బరాయుడు, యానాది రెడ్డి, శేషారెడ్డి, నారాయణరావు, ఒమ్మిన సుబ్రమణ్యం, వెంకటరెడ్డి, సుబ్బయ్య, శ్రీనివాస రాజు, రామయ్య స్వామి, అపర్ణ, రజనీ ప్రియ, కె.రవీంద్ర కుమార్, రఘురామిరెడ్డి, సుధాకర్, మౌనిక, రమణ, లైబ్రెరియన్ నారాయణ రావు, సురేష్‌బాబు, మల్లిఖార్జున, రామమోహన్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి- కోవూరు
అంతర్జాతీయ మాతభాషా దినోత్సవం స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో తెలుగు శాఖ ఆధ్వర్యంలో ప్రపంచ మాతభాషా దినోత్సవ వేడుక ఘనంగా నిర్వహించారు. సభాధ్యక్షులు, కళాశాల ప్రిన్సిపల్ లక్ష్మీ ప్రసూన ప్రశంసించారు. ముఖ్య అతిధిగా విచ్చేసిన డాక్టర్ జి.పద్మప్రియ ప్రభుత్వ డిగ్రీ కళాశాల విడవలూరు, తెలుగుశాఖాధ్యక్షులు తెలుగు భాష ఘనతను, వర్తమానంలో భాష ఎదుర్కొంటున్న సమస్యలను, భాషా ప్రాధాన్యతను చక్కగా చక్కగా వివరించారు. ఏ.ఎల్.ఎల్.ఏ.ఆర్ వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ కె. రాంప్రసాద్, ఐ.క్యూ.ఎ.సి.కో ఆర్డినేటర్ ఎం. మధుసూదన్ ఏ. హరి ప్రసాద్ భాషా విశేషాలను వివరించారు. ప్రోగ్రాం కన్వీనర్ డాక్టర్ శ్యామలకుమార్ వందన సమర్పణలో వేడుక ముగిసింది.

మాట్లాడుతున్న జి.వెంకటప్రసాద్

ఆరోగ్య కేంద్రంలో ఆకస్మిక తనిఖీలు

ప్రజాశక్తి-ఉదయగిరి
మండల పరిధిలోని గండిపాలెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో జిల్లా అదనపు వైద్యాధికారి జిల్లా క్షయ లెప్రసీ ఎయిడ్స్ నివారణ ఆత్మకూరు ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ జి వెంకట ప్రసాద్ ఆకస్మిక తనిఖీలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం నిర్వహిస్తున్న అద్దె భవనానికి సరైన వసతులు లేవని మరమ్మతులు చేయబడిన గవర్నమెంట్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించి అక్కడి నుంచి రోగులకు మెరుగైన వైద్యసేవలు అందించాలన్నారు. వైద్యశాలలోని వసతులను పరిశీలించిన ఆయన రోగులకు అరుదైన వసతులు అందించడానికి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం అణువుగా ఉందని తెలిపారు. కనుక వెంటనే అద్దె భవనం నుంచి పాత ప్రాథమిక ఆరోగ్య కేంద్ర భవనంలోకి మార్చాలని తగు సూచనలు చేశారు. కార్యక్రమంలో ఆరోగ్యకేంద్రం వైద్యాధికారులు శివకల్పన, వినీత, సి హెచ్ ఒ శివకుమారి, హెల్త్ ఎడ్యుకేటర్ కె.వెంకట సుబ్బయ్య పాల్గొన్నారు.

హుండీలోని ఆదాయం లెక్కింపు

ప్రజాశక్తి-కొడవలూరు
మండలంలోని గండవరంలో కొలువైన గంగా పార్వతి సమేత ఉదయకళేశ్వరస్వామి బ్రహ్మోత్సవ రాబడి స్వల్పంగా పెరిగింది. గతేడాది బ్రహ్మోత్సవాలతో పోల్చుకుంటే రూ.50 వేల రాబడి అధికంగా వచ్చింది. ఈ ఏడాది బ్రహ్మోత్సవాలకు రూ.14,15,288లు రాగా, గతేడాది రూ.13,85,250లు వచ్చింది. ఈ నెల 14 నుంచి స్వామి వార్ల బ్రహ్మోత్సవాలు అత్యంత వైభవంగా జరగడం తెల్సిందే. ఈ బ్రహ్మోత్సవాల హుండీ లెక్కింపు కార్యక్రమాన్ని దేవాదాయ శాఖ అధికారుల సమక్షంలో మంగళవారం నిర్వహించారు. హుండీ లెక్కింపు కార్యక్రమంలో దేవాదాయశాఖ ఈఓ చిట్టిబాయి, ఆలయ ట్రస్టీలు శేషురెడ్డి, ఏ.వెంకటరమణమ్మ, ఆలయ అర్చకులు బండారు సుబ్రమణ్యం, నిర్వాహక కమిటీ సభ్యులు రామిరెడ్డి రాజేష్ రెడ్డి, బెల్లం వెంకట నగేష్ నాయుడు పాల్గొన్నారు.



బ్రహ్మోత్సవాలకు ఏర్పాట్లు

ప్రజాశక్తి-బిట్రగుంట
బోగోలు మండలం కొండ బిట్రగుంట గ్రామంలో వెలసి ఉన్న శ్రీ ప్రసన్న వెంకటేశ్వర స్వామి వారి బ్రహ్మోత్సవాలు మార్చి 2వ తేదీ నుండి 8వ తేదీ వరకు జరుగుతాయని ఎంఎల్ఎ రామిరెడ్డి ప్రతాప్ కుమార్ రెడ్డి తెలిపారు. బ్రహ్మోత్సవాలకు రెండు రాష్ట్రాల నుండి విదేశాల నుండి భక్తులు మొక్కులు తీర్చుకునేందుకు సుమారు రెండు లక్షలకు పైగా వస్తారని అంచనా వేస్తున్నారు. బ్రహ్మోత్సవాల సందర్భంగా ఎపిఎస్ఆర్‌టిసి నెల్లూరు, కావలి, అల్లూరు, బోగోల నుండి ప్రత్యేక బస్సులను నడిపేందుకు చర్యలు తీసుకుంటుంది. శ్రీ ప్రసన్న వెంకటేశ్వర స్వామి ఆలయం జాతీయ రహదారికి సుమారు 5 కిలోమీటర్ల దూరంలో ఉండటం వల్ల భక్తులు పెద్ద సంఖ్యలో ద్విచక్ర వాహనాలలో ఎడ్లబండ్లలో కార్లలో పెద్ద సంఖ్యలో ప్రతి సంవత్సరం పాల్గొంటారు. శ్రీ ప్రసన్న వెంకటేశ్వర స్వామి ఆలయం అభివృద్ధి పనులకు టిటిడి, దాతల సహకారంతో 70 కోట్లతో మాస్టర్ ప్లాన్‌ను కావలి ఎంఎల్ఎ రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి రూపొందించి పనులను వేగవంతంగా జరిగేలా చర్యలు తీసుకుంటున్నారు. మార్చి 2న గిరి ప్రదర్శన, 3 శేష వాహనం, 4 హనుమంత సేవ 5 గరుడ సేవ, 6 తెప్పోత్సవం, 7 కళ్యాణం రథోత్సవం, 8 చక్రస్థానం ఏకాంత సేవ కార్యక్రమాలు జరుగుతాయి.

జెవివి ఆధ్వర్యంలో క్విజ్ పోటీలు

ప్రజాశక్తి-కావలి
కావలి రెడ్‌క్రాస్ భవనంలో జన విజ్ఞాన వేదిక (జెవివి) కావలి పట్టణ శాఖ ఆధ్వర్యంలో మంగళవారం పాఠశాలల విద్యార్థులకు జూనియర్, సీనియర్ విభాగాలకు క్విజ్ పోటీలు నిర్వహించారు. కావలి పట్టణంలోని సీనియర్స్ 30 పాఠశాలలు, జూనియర్స్ 28 పాఠశాలలు నుండి స్కూల్‌కు ముగ్గురు చొప్పున విద్యార్థులు హాజరయ్యారు. జెవివి కావలి పట్టణ శాఖ, గౌరవ అధ్యక్షులు డాక్టర్ బెజవాడ రవికుమార్ అధ్యక్షులు తోట వెంకటేశ్వర్లు మాట్లాడుతూ 28న జరిగే జాతీయ సైన్స్ ది నోత్సవం సందర్భంగా వివిధ పోటీలు నిర్వహిస్తున్నా మన్నారు.

ప్రజల్లో ఉండే మూఢ నమ్మకాలను, తొలగించడం, విద్యార్థులలో శాస్త్రీయ విజ్ఞానం పెంపొం దించడం కోసం ఇటువంటి కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలియజేశారు. ఇప్పటి వరకు నిర్వహించిన వివిధ పోటీలకు పాఠశాల యాజమాన్యం, తల్లిదండ్రులు తమకు అన్ని విధాలా సహకరించినందుకు ధన్యవాదాలు తెలుపుతున్నామన్నారు. సీనియర్ విభాగానికి ప్రశ్నాపత్రం, కావలి రెడ్‌క్రాస్, సెక్రటరీ గంధం ప్రసన్నాంజ నేయులు, జూనియర్స్ విభాగానికి, జిల్లా రెడ్‌క్రాస్ ఇన్‌ఛార్జి చైర్మన్ దామిశెట్టి సుధీర్ నాయుడు ప్రశ్నాపత్రం రిలీజ్ చేశారన్నారు. సీనియర్స్ విభాగానికి క్విజ్ మాస్టర్‌గా షేక్ జిలానిబాషా, ఆకుల రమణయ్య, జూనియర్స్‌కు ఎస్.రామకృష్ణ నిర్వహించారని తెలిపారు. ఇప్పటివరకు నిర్వహించిన పోటీలలో విజేతలైన వారికి జాతీయసైన్స్ దినోత్సవం రోజున బహుమ తులు, అందచేస్తామని తెలియజేశారు. సెక్రటరీ గాదిరెడ్డి హరనాధ్, జిల్లా నాయకులు ఆకుల రమణయ్య, ఉపాధ్యక్షులు, పాపిశెట్టి జానకిరామ్, జాయింట్ సెక్రటరీ ఖాదర్ బాషా, శారదా, వెంకయ్య, జాన్, షేక్ రఫీ, రెడ్‌క్రాస్ భవనం, వెన్యూ ఇన్‌ఛార్జ్ హరినారపరెడ్డి, తదితరులు హాజరై సహకరించారు.

పోటీలు నిర్వహిస్తున్న జెవివి నాయకులు

యూనివర్సిటీలో హోమం సరికాదు : జెవివి

ప్రజాశక్తి-కావలి
లౌకిక రాజ్యమైన భారతదేశంలో ప్రభుత్వ విద్యాలయాల్లో మత సంబంధిత కార్యక్రమాలను నిర్వహించడం రాజ్యాంగ విరుద్ధమని జెవివి పట్టణ శాఖ అధ్యక్ష, కార్యదర్శులు తోట వెంకటేశ్వర్లు, గాదిరెడ్డి హరనాధ్ తమ ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అనంతపురం శ్రీకృష్ణ దేవరాయ యూనివర్శిటీలో సాక్షాత్తూ వైస్‌ఛాన్సలర్ 24న మృత్యుంజయ హోమం చేయ తలపెట్టారని విమర్శించారు. ఇది తెల్సిన ఎస్ఎఫ్ఐ - ఎఐఎస్ఎఫ్ విద్యార్థి సంఘాల నేతలు యాగాన్ని తక్షణమే ఆపుతున్నట్లు ప్రకటించాలని విసికి మెమొరాండం ఇచ్చి అభ్యర్థించారని తెలిపారు. దీనికి మొండిగా వైస్ ఛాన్సలర్ రామకృష్ణారెడ్డి ఉద్యోగుల సంక్షేమం, వారి కోరిక మేర హోమం తలపెట్టామని దీనిలో మత రాజకీయ విధానాలు లేవని బుకాయించడం అత్యంత గర్హణీయమన్నారు. విద్యాలయాల్లో మత, రాజకీయ విధానాలకు ప్రతిరూపమే "మృత్యుంజయ హోమం" అని తెలిపారు. శాస్త్రీయ దృక్పథం వైపు భావి పౌరులను నడపాల్సి ఉండగా మూఢ నమ్మకాలను పెంచే మృత్యుంజయ హోమం శాస్త్రీయతకు విరుద్ధమైందన్నారు. 24వ తేదీన హోమాన్ని ఆపి తీరాలని జెవివి తరపున డిమాండ్ చేస్తున్నామన్నారు.

కంపచెట్లు తొలగింపు

ప్రజాశక్తి-ఆత్మకూరు అర్బన్
మండలంలోని మురగళ్ల గ్రామంలోని హైస్కూల్లో మంగళవారం నిర్వహించిన ఎన్ఎస్ఎస్ కార్యక్రమంలో భాగంగా విద్యార్థులు కంపచెట్లను తొలగించారు. ఆత్మకూరు ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులు ఎన్ఎస్ఎస్ క్యాంప్‌ను నిర్వహించారు. కార్యక్రమంలో హైస్కూల్ ప్రధానోపాధ్యాయుడు జి.రఘు రామయ్య, ఉపాధ్యాయులు, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ డి.వేణుగోపాల్ రెడ్డి, సీనియర్ అసిస్టెంట్ ఎన్‌వి ప్రతాప్ రెడ్డి పాల్గొన్నారు.

'ఎన్ఎస్ఎస్'లో భాగంగా పని చేస్తున్న విద్యార్థులు

ప్రకృతి వ్యవసాయంతో అధిక దిగుబడి

ప్రజాశక్తి-ఉదయగిరి
రసాయనాలు వాడకుండా ప్రకృతి వ్యవసాయంతో అధిక దిగబడులు లాభాలు పొందవచ్చని జిల్లా వనరుల కేంద్రం డిఆర్‌సి, ఎడిఎ లక్ష్మిమాధవి పేర్కొన్నారు. మంగళవారం మండల పరిధిలోని దుంపవారిపల్లి గ్రామంలో వరి పొలంబడి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పొలంబడి కార్యక్రమంతో రసాయనిక ఎరువుల వినియోగం సాగు పెట్టుబడి ఖర్చును తగ్గించి నాణ్యమైన దిగుబడులు సాధించవచ్చని ఆమె తెలిపారు. అనంతరం ప్రకృతి వ్యవసాయాన్ని నిర్వహిస్తున్న సిబ్బందితో సమీక్ష సమావేశం నిర్వహించి సహజ సిద్ధంగా పురుగుల ఉధృతి తగ్గుటకు పిరమైన ట్రాపుల ఉపయోగం వేప నూనె వాడకం గురించి వివరించారు. ఎఇఒ రాజశేఖర్, రహమతుల్లా జెడ్‌బిఎన్ఎఫ్ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

రోడ్డు పనులు పరిశీలన

ప్రజాశక్తి-అల్లూరు : మండలంలోని నార్త్ ఆములూరు గ్రామానికి నూతనంగా నిర్మిస్తున్న సిమెంట్ రోడ్డు పనులను మంగళవారం ఆ గ్రామ సర్పంచ్ షేక్.కరిముల్లా షా ఖాదర్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సిమెంట్ రోడ్డు నిర్మాణ పనులు శర వేగంగా జరుగుతున్నాయని తెలిపారు. కాంట్రాక్టర్ ప్రసాద్ రెడ్డి నేతృత్వంలో ప్రజల శ్రేయస్సు కోసం సిమెంట్ రోడ్డు నిర్మాణం చేపట్టారని తెలియజేశారు. ఎన్నోయేళ్ల కల కావలి ఎంఎల్ఎ రామిరెడ్డి ప్రతాప్ కుమార్ రెడ్డి సహకారంతో సహకారమైందని హర్షం వ్యక్తం చేశారు.

పిడిఎఫ్ అభ్యర్థుల గెలుపునకు ప్రచారం

ప్రచారం నిర్వహిస్తున్న నాయకులు

ప్రజాశక్తి-నెల్లూరు
సిపిఎం నెల్లూరు రూరల్ మండల కమిటీ. పేద ప్రజల పక్షాన, ఉద్యోగుల, నిరుద్యోగుల సమస్యల పైన తమ వాణిని వినిపిస్తున్న పిడిఎఫ్ గ్రాడ్యుయేట్స్ ఎంఎల్‌సి అభ్యర్థి మీగడ వెంకటేశ్వర్ రెడ్డిని గెలిపించాలని కోరుతూ, నెల్లూరు రూరల్ మండలం పొట్టేపాలెం గ్రామంలో గ్రాడ్యుయేట్స్ ఓటర్లను కలిసి ఓటు వేయాలని కోరారు. కార్యక్రమంలో నెల్లూరు రూరల్ మండల కార్యదర్శి ఆలూరు తిరుపాలు, నాయకులు ముత్యాల నాగయ్య, కడివేటి ఏడుకొండలు, కడివేటి వెంకటేశ్వర్లు, పలిగిల రేవతి, డి.రవి పాల్గొన్నారు.

ప్రజాశక్తి-ఉదయగిరి
స్థానిక బాలాజీ నగర్ నాగులబావి వీధిలో పి.డి.ఎఫ్. ఎంఎల్‌సి అభ్యర్థుల గెలుపునకు మంగళవారం ప్రజా సంఘాల నాయకులు ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజా సంఘాల నాయకులు ఓటర్లను కలిసి పిడిఎఫ్ తరుపున పట్టభద్రుల ఎంఎల్‌సిగా పోటీ చేస్తున్న మీగడ వెంకటేశ్వరరెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓట్లు వేసి గెలిపించాలని కోరారు. అలాగే ఉపాధ్యాయ ఎంఎల్‌సిగా పోటీ చేస్తున్న పొక్కిరెడ్డి బాబురెడ్డిని గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు ఎంపిటిసి కాకు విజయ, కాకు వెంకటయ్య, నాయబ్, తదితరులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి-ఆత్మకూరు అర్బన్
ప్రశ్నించే తత్వం కలిగిన నాయకులను ఎంఎల్‌సి అభ్యర్థులుగా గెలిపించుకోవాలని ప్రజాసంఘాల నాయకులు డేవిడ్ రాజు పేర్కొన్నారు. మంగళవారం పట్టణంలోని వందూరుగుంట ప్రాంతంలో ఇంటింటికి తిరిగి ఎంఎల్‌సి ఎన్నికల ప్రచారం నిర్వహిస్తూ కరపత్రాలు పంపిణీ చేశారు. తూర్పు రాయలసీమ(చిత్తూరు, నెల్లూరు, ప్రకాశం) శాసనమండలి ఎన్నికలలో పోటీ చేస్తున్న పిడిఎఫ్ పట్టభద్రుల ఎంఎల్‌సి అభ్యర్థి మీగడ వెంకటేశ్వర్లు రెడ్డి, ఉపాధ్యాయ ఎంఎల్‌సి అభ్యర్థి పొక్కిరెడ్డి బాబురెడ్డిలను గెలిపించాలని ఓటర్లను అభ్యర్థించారు. ఇప్పుడున్న పరిస్థితుల్లో ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మికులు సమస్యలను పరిష్కరించేందుకు శాసనమండలిలో గళం విప్పి సమస్యలు పరిష్కరించేందుకు కృషి చేస్తారన్నారు. కార్యక్రమంలో యుటిఎఫ్ జిల్లా నాయకులు శివప్రసాద్, నందా శ్రీను పాల్గొన్నారు.

పిడిఎఫ్ ఎంఎల్‌సి అభ్యర్థుల గెలుపునకు విడవలూరులో ప్రచారం నిర్వహిస్తున్న యుటిఎఫ్, ప్రజాసంఘాల నాయకులు

ఆక్రమణలో శ్మశాన స్థలం

- ఆందోళన వ్యక్తం చేస్తున్న బీరంగుంట గ్రామస్తులు

ప్రజాశక్తి-అల్లూరు
మండలంలోని బీరంగుంట పంచాయతీ రైస్‌మిల్‌కాలనీకి చెందిన ప్రజలు మంగళవారం శ్మశాన వాటిక వద్ద ఆందోళన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా జిల్లా ఏకలవ్య ఎరుకుల, గిరిజన ప్రధాన కార్యదర్శి దేవరకొండ శ్రీనివాసులు మాట్లాడుతూ 147 సర్వే నందు 1972లో అప్పటి ఎపి రెవెన్యూ శాఖ మంత్రి నేదురుమల్లి జనార్ధన్ రెడ్డి ఎస్‌టి, బిసిల శ్మశానం కోసం 0.45 సెంట్లు భూమిని కేటాయించినట్లు పేర్కొన్నారు. రోడ్డు మార్గాన శ్మశానం ఉండడంతో అందరికన్ను ఈ స్థలంపై పడిందని తెలియజేశారు. గతంలో పిడూరు రఘురామిరెడ్డి అల్లూరుకు చెందిన సుధీర్ ఈ స్థలాన్ని కబ్జా చేయగా అప్పటి తహశీల్దారు శ్రీరాములు ఆక్రమణలు తొలగించి హద్దులను ఏర్పాటు చేశారు. ప్రస్తుత సర్పంచ్ భర్త మడపర్తి కామేశ్వరరావు ఈ స్థలంలో యథేచ్ఛగా ఇటుక బట్టీలు సాగు చేసుకుంటూ ఖాళీ చేయమంటే అడ్డం తిరుగుతున్నారని వివరించారు. ఎవరైనా గ్రామంలో చనిపోతే అంత్యక్రియలు నిర్వహించేందుకు స్థలంలేక నానా అగచాట్లు పడుతున్నామన్నారు. గ్రామంలో 150 కుటుంబాలు ఉన్న నేపథ్యంలో వర్షాకాలంలో ఎవరైనా మరణిస్తే తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని ఆవేదన వ్యక్తపరిచారు. శ్మశాన స్థలాన్ని ఖాళీ చేయాలని గ్రామస్తులు విన్నవించినా పెడచెవిన పడుతూ కాలం గడుపుతూ వస్తున్నారని ఆరోపించారు. బాధితులు తమన్నత విషయంపై తహశీల్దార్ శ్రీరామకృష్ణకు వినతిపత్రాన్ని సమర్పించి వారి గోడు వెళ్లబోసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శ్మశాన స్థలాన్ని తగు పరిశీలించి విఆర్‌ఒ, సర్వేయర్లను పంపి న్యాయం చేస్తానని హామీనిచ్చారు. కార్యక్రమంలో బీరంగుంట సచివాలయం కన్వీనర్ గరిక నరసింహారావు, పంట ఏడుకొండలు, తాత వెంకయ్య, నాశినం శేఖరయ్యా, దేవరకొండ రమేష్ తదితరులున్నారు.

శ్మశాన స్థలం వద్ద ఆవేదన వ్యక్తం చేస్తున్న గ్రామస్తులు

ఎంపిపి అధ్యక్షతన సర్వసభ్య సమావేశం

ప్రజాశక్తి-వరికుంటపాడు
మండలం సర్వసభ్య సమావేశం ఎంపిపి గవదకట్ల వెంకట లచ్చుమ్మ అధ్యక్షతన మంగళవారం డిఆర్‌డిఎ వెలుగు కార్యాలయంలో ఏర్పాటు చేశారు. ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున ఎటువంటి అభివృద్ధి పనులు ప్రజా సమస్యలపై చర్చించుకునేందుకు వీలు పడదని మరొకసారి నిర్వహించే సమావేశంలో చర్చించుకుందామని ఎంపిపి గవదకట్ల వెంకట లక్ష్మమ్మ తెలియజేస్తూ సమావేశం తాత్కాలికంగా ముగించారు. దాంతో మండల పరిషత్ ఉపాధ్యక్షులు దేవరబోయిన మధు జెడ్‌టిసి రావేల నాగేంద్ర తరచూ ఏదో విధంగా సర్వసభ్య సమావేశం వాయిదాలు వేయడం వల్ల వచ్చిన నిధులు మునిగిపోయే అవకాశం ఉందన్నారు. అంతేకాకుండా తమపై ఎంతో నమ్మకంతో పట్టం కట్టిన ప్రజలకు సమస్యల పరిష్కారం మౌలిక వసతుల కల్పనలో ఏమి సమాధానం చెప్పాలని ప్రజల్లోకి ఏ విధంగా వెళ్లాలని ఇలా చేయటం సరైనది కాదన్నారు. ఎన్నికల కోడ్ అమల్లో ఉంటే సమీక్షలు తీర్మానాలు చేసుకోవచ్చని, నూతన పనులు మాత్రమే మంజూరు కావని తెలిపారు. అంతేకానీ సమస్యలపై చర్చించుకోవచ్చని ఎంపిడిఒ విజయ్ భాస్కరరావును అడిగారు. ఎంపిపి అలా ప్రకటించి అక్కడి నుంచి వెళ్లిపోవడంతో నిరుత్సాహంతో నాయకులు, అధికారులు సమావేశ మందిరం నుండి బయటకు వచ్చారు. సమావేశ ఆవరణంలో ఏవైనా అవాంఛనీయ సంఘటనలు ఉండేందుకు ముందు జాగ్రత్తలో భాగంగా ఎస్ఐ బాల మహేందర్ నాయక్ ఆధ్వర్యంలో సిబ్బంది బందోబస్తు నిర్వహించారు.

మాట్లాడుతున్న ఎంపిపి వెంకట లక్ష్మమ్మ

గౌతమ్‌రెడ్డికి ఘన నివాళులు

ప్రజాశక్తి-మర్రిపాడు
మాజీమంత్రి మేకపాటి గౌతమ్‌రెడ్డి ప్రథమ వర్ధంతిని స్వగ్రామం బ్రాహ్మణపల్లిలో నిర్వహించారు. ముందుగా మాజీ ఎంపి తండ్రి రాజమోహన్ రెడ్డి, తల్లి మణిమంజరి, భార్యశ్రీ కీర్తిరెడ్డి, ఎంఎల్ఎ విక్రమ్‌రెడ్డి కుటుంబ సభ్యులు ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళు లర్పించారు. వ్యవసాయ శాఖ మంత్రి కాకాని గోవర్ధన్ రెడ్డి, నెల్లూరు ఎంపి ఆదాల ప్రభాకర్ రెడ్డి, మాజీ మంత్రులు అనిల్ కుమార్‌యాదవ్, బాలినేని శ్రీనివాస్ రెడ్డి, జిల్లా అధ్యక్షులు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, వెంకటగిరి నియోజకవర్గం ఇంచార్జ్ రాంకుమార్ రెడ్డి చిత్రపటానికి ఘనంగా నివాళు లర్పించారు. పలువురు ప్రజా ప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, అభిమానులు వర్ధంతి కార్యక్రమానికి తరలి వచ్చారు.

ప్రజాశక్తి-సంగం : సంగం బ్యారేజీ వద్ద స్థానిక వైసిపి నాయకులు మేకపాటి గౌతమ్‌రెడ్డి ప్రథమ వర్ధంతి వేడుకలను మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా వైసిపి నాయకులు రఘునాథ రెడ్డి మాట్లాడుతూ దుబాయ్ ఎక్స్పో నాలుగు వేల కోట్ల రూపాయలతో ఒప్పందాలు కుదుర్చుకుని, యువతకు మరెన్నో ఉద్యోగ అవకాశాలు చేకూర్చే సమయంలో ఇలా హఠాన్మరణంతో మృతి చెందడం చాలా బాధకరమని తెలిపారు. గౌతమ్‌రెడ్డి ఆశయాల సాధన కోసం ఆత్మకూరు ఎంఎల్ఎ మేకపాటి విక్రమ్‌రెడ్డి సారథ్యంలో ముందుకు నడుచుకుంటామని తెలిపారు. కార్యక్రమంలో వైసిపి మండల కన్వీనర్ శంకర్ రెడ్డి, సర్పంచ్‌లు ఆనం ప్రసాద్ రెడ్డి, చందన్ కుమార్, పిఎసిఎస్ అధ్యక్షులు శివ కుమార్ రెడ్డి, ఫణి కుమార్ రెడ్డి, నాయకులు నరేష్, మల్లికార్జున, శ్రీనివాసులురెడ్డి, వేణు, ప్రసాద్, జనార్ధన్, తదితరులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి-మర్రిపాడు : స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మాజీ మంత్రి మేకపాటి.గౌతంరెడ్డి ప్రథమ వర్ధంతి సందర్భంగా వైసిపి మండల మాజీ కన్వీనర్ గంగవరపు శ్రీనివాసులు నాయుడు ఆయన చిత్రపటానికి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం జెసిఎస్ మండల కన్వీనర్ సిద్ధంరెడ్డి మోహన్‌రెడ్డి రోగులకు పండ్లు పంపిణీ చేశారు. యువ వైసిపి నాయకులు నాయకులు సోమల.మాధవరెడ్డి, చంద్ర నారాయణస్వామి, విష్ణు, ఓబులేసు, నరసింహులు, కత్తి పద్మారావు, సురేష్, రత్తయ్య తదితర నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రజాశక్తి-ఆత్మకూరు అర్బన్ : మాజీమంత్రి మేకపాటి గౌతమ్ రెడ్డి ప్రథమ వర్ధంతి సందర్భంగా పట్టణంలోని ఎంఎల్ఎ క్యాంపు కార్యాలయంలో పార్టీ నాయకులు కార్యకర్తలు అభిమానుల నడుమ ఘనంగా నివాళు లర్పించారు. గౌతంరెడ్డి చిత్రపటానికి పూలమానాలతో అలంకరించిన చిత్రపటానికి వైసిపి నాయకులు పూలమాలలేసి ఘనంగా నివాళులర్పించారు. ఆయన మధురమైన జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. వైసిపి పట్టణ అధ్యక్షులు ఆల్లారెడ్డి ఆనందరెడ్డి, మాజీ జెడ్‌పిటిసి డాక్టర్ చిల్లూరు ఆదిశేషయ్య, సిండికేట్ ఫార్మర్ సొసైటీ చైర్మన్ నాగులపాటి ప్రతాపరెడ్డి, ఆత్మకూరు మండల అధ్యక్షులు కేత వేణుగోపాల్ రెడ్డి, మున్సిపల్ చైర్ పర్సన్ వెంకటరమణమ్మ, వైట్ చైర్మన్లు డాక్టర్ శ్రావణ్ కుమార్, షేక్ సర్దార్, నోటి వినయ్ కుమార్ రెడ్డి, కొండా వెంకటేశ్వర్లు, కౌన్సిలర్లు నోటి విజయ జ్యోతి, కొండా స్వరూప రాణి, మహబూబ్ బాషా, రాజశేఖర్, శివకోట రెడ్డి, తదితరులున్నారు.


ఎవర్ లాస్టింగ్ పుస్తకావిష్కరణ

ప్రజాశక్తి-మర్రిపాడు : మాజీమంత్రి మేకపాటి గౌతమ్‌రెడ్డి ప్రథమ వర్ధంతిని పురస్కరించుకుని ఆయన కీర్తిప్రతిష్ఠలను వర్ణిస్తూ ప్రముఖ వ్యక్తిత్వ వికాస నిపుణులు రచయిత వేణుగోపాల్ రెడ్డి, ప్రముఖ రచయిత జర్నలిస్టు విజయార్కే రాసిన ఎవర్ లాస్టింగ్ గౌతంరెడ్డి పుస్తకాన్ని మాజీ ఎంపి మేకపాటి రాజమోహన్ రెడ్డి, మణిమంజరి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వేణుగోపాల్ రెడ్డి మాట్లాడుతూ కోట్లాదిమంది ప్రజల హృదయాలలో గౌతమ్‌రెడ్డి జీవితం ఎందరికో స్ఫూర్తిని స్తుందన్నారు. కార్యక్రమంలో ఎంఎల్ఎ మేకపాటి విక్రమ్ రెడ్డి, పృథ్వీ రెడ్డి, మురళీధర్ రెడ్డి, నాయకులు పాల్గొన్నారు.